నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
10 | నిజామాబాద్ సోమవారం 17 మార్చి 2025 | ADILABAD NIRMAL



ఆదిలాబాద్‌లో నిర్మిస్తున్న ఐటీ టవర్

# యువతకు ఉపాధి ఎప్పుడో?

ఐటీ టవర్ నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం

## రూ.40 కోట్లు మంజూరు చేసిన కేసీఆర్ ప్రభుత్వం



ఐటీ టవర్ పనులు పూర్తి చేయాలని వాణిజ్య పరిశ్రమల శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్‌ను కలిసి వినతిపత్రం అందిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న(ఫైల్)

ఆదిలాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ ప్రభుత్వం పదేండ్ల పాలనలో యువతకు ఉపాధి కల్పించడానికి పకడ్బందీ చర్యలు తీసుకున్నది. యువత ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో భారీగా ఉద్యోగాలు పొందేలా చర్యలు చేపట్టింది. గతంలో కేవలం పట్టణాలకే పరిమితమైన ఐటీ కంపెనీలు కేసీఆర్ ప్రభుత్వం అందించిన సహకారంతో జిల్లాలో తమ కార్యకలాపాలు ప్రారంభించాయి. వీటిలో 300 మంది యువత ఉద్యోగాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూరల్ టెక్నాలజీ పాలసీలో భాగంగా ద్వితీయ శ్రేణి పట్టణాలకు ఐటీ రంగాన్ని విస్తరించడానికి ఆదిలాబాద్‌కు ఐటీ టవర్‌ను మంజూరు చేసింది. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ) ఆధ్వర్యంలో పనులు కొనసాగుతున్నాయి. టవర్ నిర్మాణం గడువు ముగియగా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడానికి ఇంకా ఏడాది పట్టవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో జిల్లా యువత తమకు ఉద్యోగాలు ఎప్పుడొస్తాయని ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకున్నది.

### పనుల్లో తీవ్ర జాప్యం

మావల మండలంలోని బట్టిసవర్‌గాంలో గల సర్వే నంబరు 72లో మూడెకరాల స్థలంలో ఐటీ టవర్ నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం రూ.40 కోట్లు మంజూరు చేసింది. రెండేండ్ల కిందట పనులు ప్రారంభమయ్యాయి. 48 వేల చదరపు అడుగుల వైశాల్యంలో జీ ప్లస్ ఫోర్ తరహాలో నిర్మించే ఈ టవర్‌లో పలు కంపెనీలు తమ కార్యకలాపాలను ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. ఐటీ టవర్ నిర్మాణం ఫలితంగా 800 మంది ఐటీ ఇంజినీర్లు, మరో 200 మందికి ఇతర ఉద్యోగాలు కలిపి 1000కి పైగా ఉపాధి పొందనున్నారు. జిల్లాకు చెందిన యువత ఇంజినీరింగ్, ఇతర చదువు చదివి ఉపాధి హైదరాబాద్, బెంగళూర్, పుణెతోపాటు ఇతర పట్టణాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ ఇబ్బందులు పడాల్సి వస్తుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ సహకారంతో ప్రారంభమైన రెండు ఐటీ కంపెనీల్లో 400 మంది ఉద్యోగుల కుటుంబసభ్యులు, తల్లిదండ్రులతో కలిసి సొంత ప్రాంతంలో ఉద్యోగాలు చేస్తుండగా ఐటీ టవర్ నిర్మాణంతో 1000 మంది స్థానికంగా ఉంటూ ఉపాధి పొందే అవకాశాలున్నాయి. రెండేళ్ల కింట ప్రారంభమైన ఐటీ టవర్ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నది. స్లాబులు వేసి నాలుగు పక్కల గోడల నిర్మాణం పూర్తి చేశారు. విద్యుత్ పనులు పూర్తి కాగా, టైల్స్ పనులు కొనసాగుతున్నాయి. ఇంకా చాలా పనులు చేయాల్సి ఉండగా అధికారులు పర్యవేక్షణ లోపించింది. కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన ఐటీ టవర్‌ను త్వరగా పూర్తి చేసి తమకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యువత కోరుతున్నారు.

### ఐటీ టవర్ పనులు పూర్తి చేయాలి..

ఆదిలాబాద్‌లో కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన ఐటీ టవర్ పెండింగ్ పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న కోరారు. గత నెలలో హైదరాబాద్‌లో వాణిజ్య పరిశ్రమల శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఐటీ రంగాన్ని ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకు విస్తరించడంలో భాగంగా 2002 సంవత్సరంలో ఆదిలాబాద్‌కు రూ.40 కోట్లతో ఐటీ టవర్‌ను మంజూరు చేసిందన్నారు. పలు కారణాల వల్ల టవర్ పనులు పూర్తికావడం లేదన్నారు. ఆదిలాబాద్‌లో మూడు ఐటీ పరిశ్రమలు పనిచేస్తున్నాయని వాటిల్లో 400 మంది యువత ఉపాధి పొందుతున్నట్లు తెలిపారు. కంపెనీలు ప్రైవేటు భవనాల్లో సరైన వసతులు, ఇతర సౌకర్యాలు లేకపోవడంతో తమ కార్యకలాపాలు విస్తరించలేక పోతున్నాయన్నారు. ప్రభుత్వం నిర్మిస్తున్న ఐటీ టవర్ అందుబాటులోకి వస్తే సౌకర్యాల ఫలితంగా ప్రస్తుతం కంపెనీలు విస్తరించడంతోపాటు ఇతర కంపెనీలు వచ్చే అవకాశాలు ఉన్నాయని, వందలాది మంది యువతకు ఉపాధి లభిస్తుందన్నారు.



### పనుల్లో జాప్యం..

జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం ఆదిలాబాద్‌లో ఐటీ టవర్‌ను మంజూరు చేసింది. ప్రభుత్వ నిర్లక్ష్యం, టీజీ ఐసీసీ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో ఇంజినీరింగ్ చదువుకున్న యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేయాల్సి వస్తుంది. యువతలో టవర్ నిర్మాణం విషయంలో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం స్పందించి ఐటీ టవర్ నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటే జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల్లోని 1000 మందికి మంచి వేతనంతో కూడిన ఉద్యోగాలు లభించే అవకాశాలున్నాయి.

- బుట్టి శివకుమార్, ఆదిలాబాద్



### టవర్‌లో పలు కంపెనీల ఏర్పాటుకు చాన్స్

ఆదిలాబాద్ పట్టణంలోని 48 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఐటీ టవర్ పూర్తయితే పలు ఐటీ కంపెనీలు తమ కార్యకలాపాలు ప్రారంభించే అవకాశాలున్నాయి. జిల్లా యువతకు ఉపాధి కల్పించాలని మంచి ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.40 కోట్లతో ఆదిలాబాద్‌కు ఐటీ టవర్ మంజూరు చేసింది. దీంతో ఇంజినీరింగ్ చదువుకున్న యువత తమకు స్థానికంగా ఉద్యోగాలు లభిస్తాయని ఆశించారు. ఆదిలాబాద్ ఐటీ టవర్ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. టీజీ ఐసీసీ అధికారులు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి. టవర్ అందుబాటులోకి వస్తే 1000 మంది యువతకు మంచి వేతనంతో ఉపాధి లభిస్తుంది.

- వాగ్మారే ప్రశాంత్, ఆదిలాబాద్

### ❖ రైతుబంధుకు రాం రాం జేసిండు..



నా పేరు కుంటాల పోసాని. మాది కప్పర్ల గ్రామం. నా రెండెకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నా. ఇగ రైతు భరోసా వస్తుందని గంపెడాశతో ఎదురు చూశా. బ్యాంకుకు పోయే సరికి రైతు భరోసా రాలేదని తెలిసింది. కేసీఆర్ జమానాలో గిట్ల ఎప్పుడు గాలే. వాళ్ల వేసిన రైతు బంధు పైసలతో మస్తు పొలం పనులు జేసేటోళ్లం. ఇప్పుడేమో కాంగ్రెస్‌లో ఆ రైతు బంధుకు రాం రాం జేసిండు. మాకైతే రైతు భరోసా వస్తుందో రాదో ఏం అర్థం కావట్లేదు. సార్ల దగ్గరికి పోతే ముందులాగా ఫోన్‌లో జూసి ఏం తెలుత్తలేదని జెప్పిండ్రు.

- కుంటాల పోసాని, మహిళా రైతు కప్పర్ల, తాంసి



రైతు భరోసా కోసం నిరీక్షణ

# భరోసా ఏది?

### కనబడని సెర్చ్ ఆప్షన్

తాంసి, మార్చి 16 : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం గందరగోళంగా మారింది. కొత్తగా వ్యవసాయ భూములు కొనుగోలు చేసిన రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నా వారికి నగదు అందలేదు. పాత రైతుల ఖాతాల్లోనూ పూర్తి స్థాయిలో నగదు జమ కావడం లేదు. మొదటి విడుతగా రెండెకరాల లోపు భూమి ఉన్న రైతులు, రెండో విడుతలో రెండెకరాలు ఉన్న వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు క్షేత్రస్థాయి పరిస్థితి భిన్నంగా ఉంది. కొన్ని చోట్ల ఎకరం భూమి ఉన్న రైతుల ఖాతాల్లో నగదు జమ కాలేదని ఫిర్యాదులు వస్తున్నాయి. రెండు, మూడెకరాలు ఉన్న రైతుల ఖాతాల్లో కూడా అరకొర నగదే జమైందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత సైట్‌లో సాంకేతిక సమస్య కారణంగా సెర్చ్ ఆప్షన్ కనబడక అధికారులు సమాధానం చెప్పలేక పోతున్నారు. దీంతో వ్యవసాయ అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### స్పష్టత ఇవ్వని అధికారులు..

మండలంలో ఈ యాసంగిలో 5,860 మందికి రైతు భరోసా నగదు అందాలి. ఇందులో ఇప్పటివరకు మూడెకరాల లోపు 3,454 మంది లబ్ధిదారులకు అందింది. మిగిలిన 2,406 మంది రైతులు ఎప్పుడొస్తుందోనని ఎదురు చూస్తున్నారు. దీనిపై బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులు కూడా రైతులకు సరైన సమాధానం చెప్పలేకపోతున్నారు. వ్యవసాయ శాఖ పోర్టల్లో సమస్య ఉందని కొందరు, ఎంతమందికి, ఎంత నగదు వచ్చిందనేది తమకే తెలియడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. బ్యాంకర్లు మాత్రం ఆ విషయాలను తమను అడగొద్దని రైతులకు తేల్చిచెబుతున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి రవీందర్‌ను అడుగగా.. గతంలో మాదిరిగా సెర్చ్ ఆప్షన్ ఇస్తే రైతులకు రైతు భరోసా ఎందుకు రాలేదో తెలుస్తుండే. ఆ అవకాశం ఇప్పుడు లేదు.

### కేసీఆర్ సర్ యాదికస్తుండు..



మాది కప్పర్ల. నాకు డబ్బకూచి శివారులో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. రైతు భరోసా పడిందనుకుని బ్యాంక్‌కు పోయిన. ఇంకా పడలేదని పిల్లాఫిసర్ జెప్పిండు. ఏం జేయాలో తెలుస్తలేదు. కేసీఆర్ సర్కార్ ఉన్నప్పుడు ఇట్లా ఎప్పుడు జరగలే. మాకు కేసీఆర్ సర్ మస్తు యాదికస్తుండు. గిప్పుడైతే కాంగ్రెసోళ్లు రైతులను పట్టించుకుంటలేరు. మల్లా కేసీఆర్ సర్కార్ వస్తడు సూడుండ్లి.

- మగ్గిడి గంగన్న, కప్పర్ల రైతు, మండలం తాంసి

### దళారుల దగ్గరికి పోతున్నాం..



మాది కప్పర్ల. నాకు రెండెకరాల భూమి ఉంది. మా ఊరిలో రెండెకరాల రైతులకు నాలాంటోళ్లకు మస్తు మందికి రైతు భరోసా రాలేదు. గప్పుడు బీఆర్ఎస్ వాళ్లు మా రైతులకు రైతు బంధు ఇచ్చి దళారుల దగ్గరికి పోకుండా జేసిండు. విత్తనాలు, ఎరువులు, మందులు అన్నీ కొనుక్కునేటోళ్లం. కాంగ్రెస్ పార్టీ వాళ్లని నమ్మి మోసపోయాం. కాంగ్రెస్ వొచ్చిన కాడి నుంచి మళ్లా దళారుల దగ్గరికి పోయి చేయి జాపుతున్నాం. భరోసా పైసలు కూడా సక్కగా ఇస్తలేరు.

- కొల్లూరి కాంతమ్మ, మహిళా రైతు కప్పర్ల, తాంసి

# ఆలయాల్లోనే ప్రశాంతత లభిస్తుంది

### మాజీ మంత్రి జోగు రామన్న



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, మార్చి 16 : ప్రశాంతత ఆలయాల్లోనే లభిస్తుందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని రణదివేనగర్‌లో శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామన్నను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సంస్కృతి, సంస్కారం, ఆచారాలను కొనసాగించాలన్నారు. నేటి తరం వారికి వాటిని అందిస్తు ఆధ్యాత్మికత భావం పెంపొందించాలన్నారు. కాలనీలో రామాలయ నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఐక్యతగా ఉంటూ ఆధ్యాత్మిక భావనను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కోవ రవి, మహేందర్ పాల్గొన్నారు.

# లాడ్జీలు తనిఖీ

భైంసా/నిర్మల్ చైన్‌గేట్/బాసర, మార్చి 16 : నిర్మల్, భైంసా, బాసర పట్టణాల్లో ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు పోలీసులు లాడ్జీలు, హోటల్స్, దాబాలను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. భైంసాలో సీఐ గోపీనాథ్, నిర్మల్‌లో సీఐ ప్రవీణ్‌కుమార్, బాసరలో సీఐ మల్లేశ్‌లు సోదాలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని పేర్కొన్నారు. లాడ్జీకి వచ్చిపోయే వారి ఆధార్ కార్డు వివరాలను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రిజిస్టర్‌లో క్షుణ్ణంగా నమోదు చేయాలని సూచించారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. దీనికితోడు బాసరలో అక్రమంగా మహారాష్ట్రలోని కందకుర్తి నుంచి బాసరకు వైపు అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పక్కా సమాచారంతో పట్టుకున్నట్లు తెలిపారు.

లాడ్జీలను తనిఖీ చేస్తున్న సీఐ గోపీనాథ్ →



# ఎంజేపీలో గొడవ

- ఘర్షణకు దారితీసిన వాలీబాల్ ఆట
- ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సం విద్యార్థుల మధ్య రగడ
- ఒకరికి తీవ్ర గాయాలు.. విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన



← దవాఖానలో చికిత్స పొందుతున్న ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి తరుణ్

ఖానాపూర్, మార్చి 16 : ఖానాపూర్ పట్టణంలోని శాంతినగర్‌లో గల అద్దె భవనంలో కొన్నేండ్ల నుంచి మహాత్మా జ్యోతిబా పూలే (ఎంజేపీ) బాయ్స్ రెసిడెన్సియల్ పాఠశాల అండ్ జూనియర్ కళాశాలలు కొనసాగుతున్నాయి. 530 విద్యార్థులు చదువుతుండగా.. ఇంటర్ మొదటి సంవత్సరంలో 41, రెండో సంవత్సరంలో 38 మంది విద్యార్థులు ఉన్నారు. ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు నిత్యం వాలీబాల్ ఆడుతారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం వాలీబాల్ ఆడే విషయంలో కోర్టు ఇన్‌బాల్, ఔట్ బాల్ విషయంలో రెండు టీంల కెప్టెన్లు తనయ్, తరుణ్ మధ్య రాత్రి వరకు వాగ్వాదం చోటు చేసుకున్నది. రాత్రి విధుల్లో ఉన్న ఫిజిక్స్ అధ్యాపకుడు రమేశ్ చొరవ తీసుకుని నిశ్శబ్దంగా ఉండాలని హెచ్చరించాడు. ఇద్దరితోపాటు ఇతర విద్యార్థులను వారి గదుల్లోకి పంపించారు. మళ్లీ ఉదయం 7 గంటలకు వాగ్వాదం జరిగి తోపులాట జరిగింది. దీంతో తరుణ్ కన్ను పక్కన తీవ్ర గాయమై రక్తస్రావం జరిగింది. గమనించిన సిబ్బంది హుటాహుటిన స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రథమ చికిత్స తర్వాత కళాశాల ప్రిన్సిపాల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. విద్యార్థి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ సంతోశ్‌ని వివరణ కోరగా.. ఘటన జరిగిన విషయం నిజమే చెప్పారు.

### విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

విషయం తెలుసుకున్న విద్యార్థుల బంధువులు పిల్లల భద్రతకు కళాశాల సిబ్బంది సరిగ్గా వ్యవహరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంజేపీ రెసిడెన్సియల్ స్కూల్‌లో ఉన్నతాధికారులు, స్థానికంగా సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగున్నాయని వాపోయారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మొదుగు పువ్వు రంగు మారింది

*సిరికొండ మండలంలోని నిజాంగూడ-వాయిపేట్ రోడ్డు వెళ్లే మార్గంలో మొదుగ పూల చెట్లు ఉన్నాయి. సాధారణంగా మొదుగ పూలు ఎర్ర రంగులో ఉంటాయి. కానీ.. ఇక్కడ ఉన్న మొదుగ చెట్లకు పసుపు రంగు పూలు ఉండడంతో ప్రయాణికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.*

- ఇచ్చోడ, మార్చి 16

